క్లుప్తంగా

సంక్షేమ సంఘాలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

సుభాష్‌నగర్: సంక్షేమ సంఘాలు కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. గాజులరామారం డివిజన్ మల్లారెడ్డినగర్ నూతన సంక్షేమ సంఘం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సికిందర్‌రావులతో కలిసి కమిటీ సభ్యులు శనివారం కార్పొరేటర్ రావుల శేషగిరిని మర్యాపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను అభినందించి మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయసహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు.

14 నుంచి ఇంటింటికీ సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్

నిజాంపేట్: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఈ నెల 14 నుండి నెల రోజుల పాటు ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బాచుపల్లి మండ సీపీఐ కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. శనివారం సీపీఐ మండలి సమితి సమావేశం యాదయ్య అధ్యక్షతన ఇంద్రన్న కాలనీలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ సీపీఐ జాతీయ నాయకత్వం పిలుపుతో బీజేపీ హటావో.. దేశ్‌కో బచావో కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, ఇందులో భాగంగా ఇంటింటికి తిరుగుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు.

జయంతి ఉత్సవాలు విజయవంతం చేయాలి

నిజాంపేట్: మహనీయుల జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు మేకల నాగేష్ అన్నారు. శనివారం ప్రగతినగర్‌లోని అంబేద్కర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నాగేష్ మాట్లాడుతూ ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతిరావు పూలే, ఏప్రిల్14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్. బీఆర్ అంబేద్కర్‌ల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీలకు ,కులమతాలకు అతీతంగా జయంతి ఉత్సవాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సాయిలు మల్లికార్జున్, జలగం చంద్రయ్య, మేడ సంజీవ తదితరులు పాల్గొన్నారు.

అన్ని మతాల అభ్యున్నతికి కృషి



రంజాన్ తోఫాలను అందజేస్తున్న కార్పొరేటర్ రషీదాబేగం..

చింతల్: బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని మతాల అభ్యున్నతికి కృషి చేస్తోందని చింతల్ డివిజన్ కార్పొరేటర్ రషీదా బేగం అన్నారు. శనివారం వివేకానందనగర్ షాబుద్దీన్ బస్తీలోని నూర్ మసీద్‌లో రంజాన్‌ను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన రంజాన్ తోఫాలను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహ్మద్ రఫీ, శేఖర్‌రావు, ప్రభాకర్ గుప్తా, బసవరాజు, చాంద్ పాషా, యాదగిరి పాల్గొన్నారు.

సందడి చేసిన చిన్నారులు



చిన్నారులకు పట్టాలు అందజేసిన పాఠశాల కరెస్పాండెంట్ చింతల మల్లేశం

కుత్బుల్లాపూర్: చింతల్ వెంకటేశ్వరనగర్‌లోని సత్‌జ్ఞాన్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ బాకర్ ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల కరస్పాండెంట్ చింతల మల్లేశంతో కలిసి యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా యూకేజీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రైవేట్ పాఠశాలల సంఘం ఉపాధ్యక్షుడు చింతల మహేష్‌యాదవ్, పాఠశాల అధ్యక్షురాలు చింతల విజయలక్ష్మి పాల్గొన్నారు.

రసాయన పరిశ్రమల ఇష్టారాజ్యం

జీడిమెట్లలో వందలాది రసాయన, బల్క్‌డ్రగ్ పరిశ్రమలు..
- వ్యర్థాల తరలింపుపై అందని లెక్కలు
- అధికారుల వద్ద నామమాత్రపు లెక్కలు..
- పీసీబి ఏం చేస్తోందంటూ విమర్శలు



జీడిమెట్లలోని నాలాలో డంప్ చేసిన రసాయనాలు..

జీడిమెట్ల: నగరంలోని అత్యంత కీలకమైంది జీడిమెట్ల పారిశ్రామికవాడ. అతిపెద్ద పారిశ్రామికవాడ అది.. అక్కడ వందల సంఖ్యలో ఫార్మా, బల్క్‌డ్రగ్ పరిశ్రమలు వేలాది మంది ఉద్యోగులు, కార్మికులతో ఉత్పత్తుల తయారీ కానీ అపరిశ్రమల నుండి వెలువడే ప్రమాదకర వ్యర్థాలు ఎక్కడికి తరలిస్తారో తెలియని పరిస్థితి. జీడిమెట్లలోని ఫార్మా, బల్క్‌డ్రగ్ పరిశ్రమలలో పీసీబీ అధికారుల తనిఖీలు అంతంత మాత్రంగానే ఉన్నదన్న అరోపణలు గట్టిగానే వినిపిస్తుంది. దాదాపు జీడిమెట్ల పారిశ్రామికవాడలో 100 నుండి 150వరకు బల్క్‌డ్రగ్, ఫార్మా పరిశ్రమలు ఉన్నాయి. సదరు పరిశ్రమల నుండి ప్రతినిత్యం పెద్దఎత్తున ఉత్పత్తులు వెలువడుతున్నాయి. ఉత్తత్తులకు దీటుగానే ప్రతి పరిశ్రమలో వ్యర్థాలు సైతం అంతే మోతాదులో వెలువడుతాయి. అసలు ఇంత పెద్ద మొత్తంలో వెలువడుతున్న వ్యర్థాలను పరిశ్రమ యాజమాన్యాలు ఎక్కడకు పంపిస్తుందన్న లెక్కలు మాత్రం ఎవరికి అంతు చిక్కడం లేదు.

పరిశ్రమల్లో వెలువడిన వ్యర్థాలు ఎక్కడకు వెళుతున్నాయి..?

పరిశ్రమలలో వెలువడిన వ్యర్థాలను ఎక్కడకు పంపిస్తున్నారు అన్న లెక్కలు మాత్రం అధికారుల వద్ద సరిగా లేవనే తెలుస్తుంది. ఒకవేళ కొన్ని లెక్కలు ఉన్నప్పటికి అవి వాస్తవానికి భిన్నంగా ఉన్నట్లు తెలుస్తుంది. కొన్ని పరిశ్రమలు నిబంధనల ప్రకారం వ్యర్థాలను జీడిమెట్లలోని జేఈటీఎల్ శుద్ధి కేంద్రానికి పంపుతుండగా మరికొన్ని పరిశ్రమలు అసలు వ్యర్థాలను ఎక్కడకు పంపుతున్నారో అధికారుల వద్ద లెక్కల ఆనవాళ్లు సైతంలేవు. కొన్ని పరిశ్రమలు వ్యర్థాలను రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా బహిరంగ ప్రదేశాల్లో డంప్ చేస్తుండగా మరికొన్ని పరిశ్రమలు వర్షాలు కురిసినపుడు వ్యర్థాలను నాలాల్లోకి మోటర్ల ద్వారా డంప్ చేస్తున్నారు. వీటికోసం కొన్ని పరిశ్రమలో కనిపించకుండా వ్యర్థాలను నిల్వచేసే అండర్‌గ్రౌండ్ ట్యాంకులను నిర్మించుకున్నట్లు తెలుస్తుంది.

అసలు పీసీబీ అధికారులు ఏంచేయాలి..

పీసీబీ అధికారులు ప్రతిపరిశ్రమలో తయారయ్యే ఉత్పత్తులు ఏమి వాటికోసం వాడే ముడి సరుకు రసాయనాలు ఏంటి అనే లెక్కలు పరిశ్రమ నుండి సేకరించాలి. దీని ద్వారా ఉత్పత్తుల పేరు మోతాదు తెలిసినపుడు ఖచ్చితంగా వ్యర్థాలు ఎంత మొత్తంలో విడుదల అవుతున్నాయి. ఏఏ వ్యర్థాలు వెలువడుతున్నాయో వారికి ఒక అంచనా ఉంటుంది. కానీ ఇటీవల అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడంతో లెక్కల్లో అయోమయం జరుగుతుందన్న అభియోగాలు బలంగానే ఉన్నాయి.

లెక్కలు చెప్పడం లేదా..

కొన్ని పరిశ్రమల్లో అధికారులు తనిఖీలకు వెళ్లినపుడు వారు లెక్కలు సరిగా చెప్పడం లేదన్న విషయం తెలుస్తుంది. కొంతమంది పెద్ద పరిశ్రమలను అధికారులు ప్రశ్నలు అడిగినపుడు పరిశ్రమ యాజమాన్యం బడా నేతలు, రాజకీయ నాయకులతో అధికారులకు ఫోన్‌లు చేయిస్తూ వారి నోళ్లు మూయిస్తున్నారన్నట్లు తెలుస్తుంది. ఇలా అధికారుల మాట యాజమాన్యాలు వినకుండా విచ్చలవిడిగా ప్రవర్తిస్తూ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో డంప్‌చేస్తే పర్యావరణానికి ప్రమాదం వాటిల్లే అవకాశం లేకపోలేదు.

ట్యాంకర్ ద్వారా వ్యర్థాలు డంపింగ్ చేస్తున్న నిర్వాహకులు

గతంలో జీడిమెట్ల పారిశ్రామికవాడలో పలుచోట్ల వ్యర్థాల డంపింగ్ కేంద్రాలు బయటపడ్డాయి. వాటి కేసులు మాత్రం నెమ్మదిగా నీరుగారి పోయాయి. గత ఆరు నెలల క్రితం జీడిమెట్ల డిపో వద్ద బహిరంగంగా నాలా వద్ద ట్యాంకర్ ద్వారా డంపింగ్‌కు పాల్పడుతుండగా పీసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం సదరు వ్యర్థాలను డంప్‌చేసే గుండాలు పీసీబి సిబ్బందిపై దాడికి పాల్పడి తప్పించుకుపోయారు. పీసీబీ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి దాడకి పాల్పడిన నిందితులు మాత్రం చట్టం నుండి తప్పించుకున్నట్లుగానే తెలుస్తోంది.



ఇటీవల ఓ మూసివేసిన పరిశ్రమ వద్ద బయటపడ్డ రసాయన వ్యర్థాలు..

వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిన మోదీ



షాపూర్‌నగర్‌లో ప్రధాని మోదీ సభకు జెండా ఊపీ బస్సులను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్.

కుత్బుల్లాపూర్: తెలంగాణ అభివృద్ధి పట్ల ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో శనివారం జరిగిన ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బస్సులలో ర్యాలీగా తరలివెళ్లారు. అంతకుముందు షాపూర్‌నగర్‌లోబస్సు ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ తెలంగాణలో రూ. 11,355 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టారని, వేలాది కోట్ల రూపాయలు కేటాయించిన ప్రధాని రాష్ట్రానికి వస్తే స్వాగతించాల్సిందిపోయి బీఆర్ఎస్, వామపక్ష



పార్టీల నాయకులు నిరసనలు తెలపడం విడ్డూరంగా ఉందనిన్నారు. సింగరేణి భూములను అమ్ముకొని, తీవ్ర నష్టం చేసింది బీఆర్ఎస్ పార్టీ నాయకులేనని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చి రెడ్డి పాల్గొన్నారు.

విభజన హామీలు నెరవేర్చని కేంద్ర ప్రభుత్వం

రంగారెడ్డినగర్: ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణాకు దక్కాల్సిన వాటాను ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం వివక్ష పూరితంగా వ్యవహరిస్తోందని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. శనివారం రాష్ట్ర పర్యటనకు ప్రధాని మోదీ వస్తున్న నేపథ్యంలో వామపక్షాల ఆధ్వర్యంలో షాపూర్‌నగర్‌లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణలో సింగరేణి సంస్థను ప్రైవేట్ పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, ఉక్కు పరిశ్రమ, గిరిజన హార్టికల్చర్ యూనివర్సిటీ, ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రం, కాజీపేట



షాపూర్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న వామ పక్ష పార్టీల నాయకులు

రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ల హామీలు ఇచ్చి నేటికీ నెరవేర్చడం లేదని ఆరోపించారు.

సంస్కృతి సంప్రదాయాల గురించి వివరించాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మోతీనగర్: తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య మరింత సంబంధాలు పటిష్టపర్చేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జన్‌నెక్స్ట్ పాఠశాల కరస్పాండెంట్ జితేంద్ర పేర్కొన్నారు. శనివారం అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌లోని జెన్‌నెక్స్ట్ పాఠశాలలో బాండింగ్ విత్ పేరెంట్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ జితేంద్ర మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులకు బాల్య దశలోనే సంస్కృతి సంప్రదాయాలతో పాటు కుటుంబ వ్యవస్థ, కుటుంబంలోని పెద్దల పట్ల గౌరవ మర్యాదలు పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

పారిశుద్ధ్య పనులపై అలసత్వం ప్రదర్శించవద్దు



రాంకీ సంస్థ ప్రతినిధులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్, హైదర్‌నగర్,ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి డివిజన్లలో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై శనివారం ఏఎంఓహెచ్ డాక్టర్ మమత, జీహెచ్‌యంసి శానిటేషన్ విభాగం అధికారులు ఎస్ఆర్‌పి, ఎస్ఎఫ్ఏలు, రాంకీ ప్రతినిధులతో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నే శ్రీనివాసరావులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. పారిశుధ్య పనుల నిర్వహణపై అలసత్వం ప్రదర్శించవద్దని, అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు. అధికారుల మధ్య సమన్వయలోపంతో పారిశుధ్యం పనులు కుంటుపడటంపై ఆయన తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు. రాంకీ సంస్థ ఉద్యోగులకు అనుభవం లేకపోవడం, సరైన రవాణా వ్యవస్థను ఏర్పాటు చేసుకోలేకపోవడంపై జీహెచ్‌యంసి అడిషనల్ కమీషనర్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. కాలనీలు, బస్తీలలో, ప్రధాన రహదారిపై చెత్త కుప్పలు పేరుకుపోవడంతో వర్షాల వల్ల డ్రైనేజీలో చెత్త నుంచి నీటి ప్రవాహం సాగకుండా వరదలకు కారణం అవుతోందని, దీంతో అంటురోగాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉందన్నారు. పారిశుధ్య పనుల నిర్వహణ ఇకనుంచైనా సక్రమంగా జరిగేలా చూడాలని, ఏఎంఓహెచ్‌ల పర్యవేక్షణ ఎప్పుడు ఈ విధంగానే ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

కొంపల్లిలో సిరి వస్త్ర షోరూమ్ ప్రారంభం



షోరూమ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధినేత మాజేతి సురేష్



సిరి వస్త్ర షోరూమ్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: కొంపల్లిలో సిరి వస్త్ర షోరూమ్ 16వ బ్రాంచ్‌ను శనివారం షోరూమ్ అధినేత మాజేటి సురేష్‌తో కలిసి ఎమ్మెల్యే వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫ్యాషన్ ప్రపంచంలో కొనుగోలుదారుల అభిరుచులకు అనుగుణంగా నూతన ఫ్యాషన్ దుస్తులను సరసమైన ధరలకు అన్నివర్గాల ప్రజలకు అందించాలన్నారు. షోరూం అధినేత మాజేటి సురేష్ మాట్లాడుతూ నేటి యువ తరానికి తగిన రీతిలో ఫ్యాషన్ వస్త్రాలు తమ షోరూంలోలో అందుబాటులో ఉంచామని, కొంగొత్త ఫ్యాషన్ దుస్తులతో కొంపల్లి ప్రాంత వాసులను ఆకట్టుకుంటామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ప్రగతినగర్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ ఎలీప్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఎలీప్ ఇండస్ట్రీయల్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఉచిత వైద్యశిబిరం



సుభాష్‌నగర్: కూకట్‌పల్లికి చెందిన జనహిత సేవా ట్రస్ట్, సూరారం ఆర్ఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో శనివారం సాయిబాబానగర్‌లోని సాయిబాబా టెంపుల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆర్ఎస్ఎస్ మేడ్చల్ జిల్లా సమరసత కన్వీనర్ కొట్టె రవి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగిన శిబిరంలో ఆర్థోపెడిక్, చర్మసంబంధిత, స్త్రీ వ్యాధుల నిపుణులు 400 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

కార్మికులంతా ఏకం కావాలి



చింతల్ హెచ్‌ఎంటీ గ్రౌండ్‌లో సమావేశమైన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

చింతల్: కుత్బుల్లాపూర్ ప్రాంత జలమండలి (డివిజన్ 12) ఔట్‌సోర్సింగ్ కార్మికులు భవిష్యత్తు కార్యచరణ సమావేశాన్ని శనివారం చింతల్ హెచ్‌ఎంటీ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా యూనియన్ జనరల్ సెక్రటరీ కిరణ్, వైస్ ప్రెసిడెంట్ బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులంతా ఏకంగా ఉంటే ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొనవచ్చని, జీవో నెంబర్ 14-60 ద్వారా వేతనాలు పెరిగేలా యూనియన్ కృషి చేస్తుందని, దానికి అందరూ కలిసికట్టుగా రావాలని తెలియజేశారు.

ద్విచక్ర వాహనం చోరీ

సుభాష్‌నగర్: పార్కు చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధి సూరారం క్రాస్ రోడ్డులో చోటు చేసుకుంది.. సూరారం ప్రాంతానికి చెందిన సంతోష్ శుక్రవారం రాత్రి 10 గంటలకు సూరారం చౌరస్తాలోని మెడికల్ షాప్ వద్ద తన బైక్‌ను పార్కు చేసి పక్కనే ఉన్న టీహోమ్‌కు వెళ్లాడు. కొద్ది సేపటి తరువాత తిరిగి వచ్చి చూడగా బైక్ మాయమైంది. అయితే చోరీ చేస్తున్న దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీలో రికార్డు అయ్యాయి. ఈ మేరకు బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

మోదీ పర్యటనకు నిరసనగా ధర్నా



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బీఎన్ సుదర్శన్, రాజశేఖర్, ఎం.శంకర్

కూకట్‌పల్లి: రాష్ట్ర విభజన హామీలు అమలు చేయని మోదీ రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి వ్యతిరేకంగా బాలానగర్‌లోని వై జంక్షన్ దగ్గర సీపీఎం నాయకులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు బిఎన్ సుదర్శన్, ఐలాపురం రాజశేఖర్, ఎం.శంకర్‌లు పాల్గొని మాట్లాడుతూ సింగరేణి బొగ్గు గనులకు టెండర్లు పిలిచిన నరేంద్రమోదీకి తెలంగాణలో అడుగుపెట్టే నైతిక హక్కు లేదని విమర్శించారు తెలంగాణకు తీరని అన్యాయం చేసిన ప్రధాని నరేంద్రమోదీ, వందేభారత్ రైలు ప్రారంభం కోసం హైదరాబాద్ పర్యటనకు వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తున్నామన్నారు. విభజన హామీలైన బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా, గిరిజన విశ్వవిద్యాలయం వంటి రాష్ట్ర హామీలు అమలు చేయని నరేంద్రమోడీకి తెలంగాణలో అడుగుపెట్టే నైతిక హక్కు లేదన్నారు.

కార్యకర్తల్లో కొత్త జోష్



మోదీ సభకు వద్దేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో తరలి వెళ్లిన బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి: ప్రధానమంత్రి మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో శనివారం కూకట్‌పల్లి బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ సభకు తరలి వచ్చిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. మోదీ సందేశంతో తెలంగాణ బీజేపీ కార్యకర్తల్లో కొత్తజోష్ వచ్చిందన్నారు. తనదైన పాలనతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారని కొనియాడారు.

రెమెడీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

భాగ్యనగర్‌కాలనీ: నిజాంపేట్‌రోడ్డులోని సెవన్ హిల్స్ కాలనీలో శేషాద్రి అపార్ట్‌మెంట్ బ్లాక్‌లో రెమెడి హాస్పటల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని కేపీహెచ్‌బీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిషన్‌కుమార్ హాజరై ప్రారంభించారు. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ రకాల వైద్య సేవలను వినియోగించుకున్నారు. అనంతరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిషన్‌కుమార్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు నివాసం ఉండే ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయటానికి ముందుకు వచ్చిన రెమెడి ఆసుపత్రి యాజమాన్యాన్ని ఆయన అభినందించారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్



పేట్‌బషీరాబాద్ పోలీసులు సీజ్ చేసిన 30 కిలోల గంజాయి ప్యాకెట్లు

కుత్బుల్లాపూర్: గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన మేరకు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తూరు గ్రామానికి చెందిన ఉపేందర్ (28), మహబూబాబాద్ జిల్లా గుండెపూడి తాండాకు చెందిన తేజావత్ ఉపేందర్(38) లు గత కొంత కాలంగా గంజాయి విక్రయాలు చేపడుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం పేట్‌బషీరాబాద్ పోలీసులకు గంజాయి రవాణాపై విశ్వసనీయ సమాచారం అందడంతో సుచిత్ర చౌరస్తాలో ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల చెకింగ్ చేపట్టారు. ప్యాసింజర్ ఆటోలో తనిఖీలు చేపట్టగా 15 ప్యాకెట్లలో 30 కిలోల గంజాయి పట్టుబడింది.



నిందితులు ఉపేందర్, తేజావత్ ఉపేందర్‌లు

దీంతో నిందితులను స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా ఆనంద్ అనే వ్యక్తి నుండి రూ.50 వేలకు గంజాయిని కొలుగోలు చేసినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుండి 30 కిలోల గంజాయి, ప్యాసింజర్ ఆటో, మూడు మొబైల్ ఫోన్‌లు, రూ.6,500 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.